జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 6 | ఏప్రిల్ | 2026 • పేజీలు : 5


## భద్రాచలంలో వైభవంగా గోదావరి హారతి



**భద్రాచలం, ఏప్రిల్ 5, ప్రజా జ్యోతి:** భద్రాచలం దివ్యక్షేత్రంలోని పుణ్య గోదావరి స్నాన ఘట్టాల వద్ద నిర్వహిస్తున్న గోదావరి నదీ హారతి కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. చైత్ర శుద్ధ తదియ సందర్భంగా భక్తుల రాక మరింత పెరిగిందని, ఈ హారతి దర్శనం అత్యంత ప్రతిష్టాత్మకమైందని పురోహితులు రామవజల రవికుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం శ్రీ సీతారామ చంద్రస్వామి దివ్యక్షేత్రం సమీపంలోని గోదావరి కరకట్ట వద్ద నిర్వహించిన నదీ హారతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, చైత్ర శుద్ధ తదియ రోజున నిర్వహించే గోదావరి హారతి ప్రత్యేకమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగినదని పేర్కొన్నారు. అనంతరం గోదావరి హారతి విశేషాలు, చైత్ర శుద్ధ తదియ ప్రత్యేకతను

మిగతా 2 లో...

- చాతకొండ వేటగాళ్ల కేసులో నిజాలు దాచి పెడుతున్నారా...?
- వృద్ధులపై కేసు నమోదు పై కొత్త సందేహాలు
- కదలి కదలని చిన్న వాహనం పై భారీ సైజ్ జంతువులను ఎలా తరలించారో
- విజిలెన్స్ జోక్యం తప్పదా?



# నమ్మశక్యంగా లేదయ్యా గురూ...?

**కొత్తగూడెం, ఏప్రిల్ 5 (ప్రజాజ్యోతి):** లక్ష్మీదేవిపల్లి మండలం ఉమ్మడి చాతకొండ అటవీ శాఖ పరిధిలో వెలుగులోకి వచ్చిన వన్యప్రాణాల వేట కేసు పలు అనుమానాలకు తావిస్తోంది. ఫారెస్ట్ అధికారులు ఇద్దరు వృద్ధులను అదుపులోకి తీసుకోవడంతో పాటు ఆ ఇద్దరు వృద్ధులు కలిసి పాత టీవీఎస్ లూనా వాహనంపై రెండు దుప్పులను తరలించినట్టు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ ఘటనపై స్థానికులు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. నడవడానికి కూడా ఇబ్బంది పడే వయసు మీద పడిన వృద్ధులు అంత భారీ జంతువులను వేటాడి చిన్న వాహనంపై తరలించడం సాధ్యమేనా అని ప్రశ్నిస్తున్నారు. వాహనంపై రెండు భారీ దుప్పులను తీసుకురావాలంటే ప్రధాన రహదారినే ఉపయోగించాల్సిన అవసరం ఉంటుందని ఒకేసారి రెండు దుప్పులు వేటగాళ్ల ఉచ్చులో పడటం కూడా అనుమానాస్పదంగా మారిందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. అసలు ఆ రెండు అటవీ జంతువులు ఏ ప్రాంతంలో వేట నిర్వహించారో..? అక్కడి నుండి ఎలా తరలించారో..? వేట ఏ విధంగా చేపట్టారో...? వేటగాళ్లు

మిగతా 2 లో...

## ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 5, ప్రజాజ్యోతి:** స్వాతంత్ర్య సమరయోధుడు, నవభారత నిర్మాత, మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, బాబు జగ్జీవన్‌రామ్ 1908లో బీహార్ రాష్ట్రంలోని ఒక సాధారణ కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగి దేశ అత్యున్నత పదవులను అధిష్ఠించిన మహనీయుడని కొనియాడారు. చిన్నతనం నుంచే సమాజంలో ఉన్నకుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా గళమెత్తిన ఆయన, విద్యనే ఆయుధంగా మలచుకుని అన్యాయాలపై పోరాడారని తెలిపారు. స్వతంత్ర భారత తొలి కేబినెట్‌లో అతి పిన్న వయస్కుడైన మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జగ్జీవన్‌రామ్, కార్మిక శాఖ మంత్రిగా కార్మికుల సంక్షేమం కోసం అనేక చట్టాలను అమలు చేసినట్లు వివరించారు. ఆయన జీవితం ఒక తెరిచిన పాఠశాల వంటిదని, సామాజిక సమానత్వం

మిగతా 2 లో...

## గిరిజన దర్బార్ కు సకాలంలో హాజరుకావాలి

- ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్



**భద్రాచలం, ఏప్రిల్ 5, ప్రజాజ్యోతి:** భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు.ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో, అన్ని శాఖల ఐటిడిఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన సూచించారు. సంబంధిత అధికారులు ఉదయం 10.30 గంటలకు ఐటిడిఏ సమావేశ మందిరంలో తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు. గిరిజనులు తమ సమస్యలకు సంబంధించిన అంశాలను లిఖితపూర్వకంగా ఫిర్యాదుల రూపంలో సమర్పించాలని, వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజనులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కోరారు.

## మహనీయుడి జయంతి వేడుకలు ఇలా జరిగితే ఎలా..?



- ఘనంగా జరగాల్సిన వేడుకలు నిర్వాహన కమిటీ నిర్లక్ష్యానికి బలైందా..
- సరైన ప్రణాళిక లేకపోతే ఫలితం ఇట్లనే ఉంటుందా..?
- మహనీయుడి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నేతలు విఫలం
- ఇదే పరిస్థితి కొనసాగితే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఎలా..?
- నిర్వాహకుల నిర్లక్ష్యంపై దళిత వర్గాల ఆగ్రహం

**కొత్తగూడెం, ఏప్రిల్ 5 (ప్రజాజ్యోతి):** స్వాతంత్ర సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా జరగాల్సిన సందర్భంలో నిర్వాహక కమిటీ నిర్లక్ష్యం కారణంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమం వేలాది మంది సమక్షంలో ఐక్యతకు ప్రతీకగా నిలవాల్సి ఉండగా చివరకు నలుగురి మధ్య నిస్సత్తువగా ముగిసినట్లుగా కనిపించింది. మహనీయుడి జయంతి వేడుక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ముందుగానే అందించాల్సిన ఆహ్వాన పత్రాలు సకాలంలో ప్రజలకు చేరకపోవడం ప్రధాన

మిగతా 2 లో...

## ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

(మొదటి పేజీ తరువాయి...)

కోసం చేసిన కృషి నేటి తరానికి ఆదర్శమని ఎస్పీ పేర్కొన్నారు.ఆయన ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, సోదరభావం కలిగిన సమాజాన్ని నిర్మించడం మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, దేశ సమగ్రతకు కృషిచేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ, ఎస్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వన్ టౌన్ సీఐ కరుణాకర్, ఎంటిఓ సుధాకర్, అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఎస్సైలు ప్రవీణ్, రవి, రామకృష్ణ, మనీషా తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో వైభవంగా గోదావరి హారతి

(మొదటి పేజీ తరువాయి...)

భక్తులకు వివరించారు. గణపతి పూజ, దీపోత్సవం నిర్వహించి, పూజా ద్రవ్యాలతో గోదావరి మాతకు అష్టోత్తర శతనామార్చన చేశారు. లోకకల్యాణార్థం ప్రతి ఆదివారం నిర్వహించే ఈ మహత్తర కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామానుగ్రహంతో గోదావరి మాత ఆశీస్సులు పొందుతున్నారని తెలిపారు. అనంతరం శాంతి మంత్ర పఠనం నిర్వహించగా, గ్రీన్ భద్రాద్రి గౌరవ అధ్యక్షులు డాక్టర్ గోళ్ళ భూపతిరావు దంపతులు ప్రసాదం పంపిణీ చేశారు. నదీ హారతి కార్యక్రమానికి పూజా సామగ్రిని రెడీమేడ్ బట్టల షాప్ అసోసియేషన్, భద్రాచలం వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో పురోహితులు సురేష్ శర్మ, అశోక్ కుమార్ శర్మ, వీరభద్ర శర్మ, రామాచార్యులు, ప్రసాద్ శర్మ, ఫణి కుమార్ శర్మ, కృష్ణ శర్మ, తేజ శర్మతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

పాల్వంచలో పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ దాడులు

## 13 వేల నగదు తో పాటు సెల్ ఫోన్లు ,ద్విచక్ర వాహనాలు ,కారు స్వాధీనం

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 5, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణంలోని గుడిపాడు, వేటచెరువు గ్రామ సమీపంలో గుట్టు చప్పుడుగా పేకాట ఆడుతున్న పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు సమాచారం, పక్క సమాచారంతో పట్టణ ఎస్సై నాగరాజు టాస్క్ ఫోర్స్ సిబ్బంది తో కలిసి మూకమ్మడిగా పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి మూడు ద్విచక్ర వాహనాలు, సెల్ ఫోన్లు ,సుమారు 13 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది, ఇది ఇలా ఉండగా ఈ దాడుల్లో అధిక మొత్తంలో నగదును, 15కు పైగా ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోగా పేకాట ఆడుతున్న వారిలో కేటీపీఎస్ కు చెందిన కొంతమంది ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం.

## ఇదేం నిర్వాహణ..?

- **దళిత నేతల తీరు చూస్తుంటే సిగ్గుపడాల్సిందే..!**

**చుంచుపల్లి ఏప్రిల్ 5 (ప్రజా జ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల పేరిట నిర్వహించిన కార్యక్రమం తీవ్ర విమర్శలకు దారితీసింది. దళిత జాతి గర్వకారణమైన మహనీయుడి జయంతిని ఘనంగా నిర్వహించాల్సిన దళిత సంఘాల నేతలు మహనీయుడి చిత్రపటానికి కనీస గౌరవం కూడా ఇవ్వలేకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. చిత్రపటానికి వేసిన దండ నామమాత్రంగానే ఉండటం మాత్రమే కాదు దళిత నేతలు చూపించిన గౌరవం కూడా అంతే స్థాయిలో ఉందా..? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇది చూస్తుంటే నిజంగానే సిగ్గుపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని దళిత వర్గాలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుడు, దేశానికి ఉప ప్రధానిగా సేవలందించిన మహనీయుడి జయంతిని ఇలా నిర్లక్ష్యంగా నిర్వహించడం సిగ్గుచేటు కాదా..? అని స్థానికులు మండిపడుతున్నారు. జయంతి అంటే పబ్లిసిటీ కోసమేనా..? కేవలం చిత్రపటం ముందు నిలబడి ఫొటోలు దిగడమేనా.. సంప్రదాయంగా చేయాల్సిన కొబ్బరికాయ కొట్టడంతో పాటు ఘన నివాళులు అర్పించడం వంటి అంశాలను పూర్తిగా పక్కనపెట్టడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. దళిత జాతి ముద్దుబిడ్డ చిత్రపటానికి జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారి మాత్రమే ముందుకు వచ్చి నివాళులు అర్పించగా_ _ _ మిగతా దళిత నేతలు మాత్రం ప్రేక్షకుల్లా నిలబడడం మరింత ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇక కార్యక్రమానికి తీసుకొచ్చిన కొబ్బరికాయలు అలాగే మిగిలిపోవడం నిర్వాహకుల నిర్లక్ష్యానికి స్పష్టమైన నిదర్శనంగా మారింది. మహనీయుడి పేరుతో కార్యక్రమాలు చేస్తూ_ _ _ ఆయనకు తగిన గౌరవం ఇవ్వలేని నేతలు సమాజానికి ఏ సందేశం ఇస్తున్నారు..? అనే సందేహాలు మొదలౌతున్నాయి.




# నమ్మశక్యంగా లేదయ్యా గురూ...?

(మొదటి పేజీ తరువాయి...)

ఎన్ని సంవత్సరాలుగా అటవీ ప్రాంతంలో ఉచ్చులు పెడుతున్నరో..? వేటగాళ్ల చేతిలో ఇంకెన్ని జంతువులు బలైయ్యాయో...? వేటగాళ్లకు సహకరిస్తున్న వారు ఎవరు..? జిల్లా కార్యాలయం సమీపంలో అటవీ జంతువులపై ఇంత దారుణాలు జరుగుతున్నప్పటికి అధికారులకు చీమ కుట్టినట్టుగా లేకపోవడం ఏమిటో..? ఇలా అనేక ప్రశ్నలు తలెత్తున్నప్పటికీ హమాలీ కాలనీ లో ఆకస్మికంగా దాడులు నిర్వహించిన ఫారెస్ట్ అధికారులు వెల్లడించిన వివరాలు కూడా పొంతన లేని విధంగా ఉన్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. అటవీ జంతువులను హతమార్చిన ఈ కేసులో అసలు నిందితులను కాపాడేందుకు అమాయకులను ఇరికించారా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టకుండానే మధ్యవర్తుల సలహాల మేరకు దాడుల అనంతరం దర్యాప్తు అంటూ రోజు వ్యవధి మొత్తం వృథా చేసి పూర్తి వివరాలను వెల్లడించకుండ రాత్రి సమయంలో మృత జంతువులతో పాటు ఇద్దరు నిందితులతో ఫోటో విడుదల చేసి కేసును ముగించేందుకు అధికారులు ప్రయత్నించారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ ఏర్పాటుతో పూర్తి వివరాలు విడుదల చేయాల్సిన వారే మౌనంగా వ్యవహారిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. అటవీ జంతువుల సంరక్షణలో భాగంగా వేటగాళ్లకు ఎలాంటి హెచ్చరికలు జారీ చేయకుండా ఉండటం కూడా అనేక అనుమానాలకు తావిస్తుంది.

### ››› అటవీ జంతువుల హత్య ఘటనలో సెటిల్మెంట్ జరిగిందా..?

హమాలీ కాలనీ ఘటనలో లక్షల రూపాయల సెటిల్మెంట్ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. అసలు నిందితులను తప్పించెందుకు ఒక్కో దుప్పికి రూ. లక్ష చొప్పున చెల్లింపులు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు నిందితులతో పాటు దుప్పులను తరలించిన ఆటో ట్రాలీని కూడ తప్పించేందుకు మొత్తం వ్యవహారం రూ.5 లక్షల వరకు వెళ్లినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వేటగాళ్ల కదలికలపై ముందస్తు సమాచారం ఉందని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నప్పటికీ ముందస్తుగా చర్యలు తీసుకుని ఉంటే రెండు అటవీ జంతువుల ప్రాణాలు కాపాడేవారని స్థానికులు పేర్కొంటున్నారు. అంతే కాకుండా హమాలీ కాలనీ లో మాంసం విక్రయం జరుగుతుందనే సమాచారం ముందుగానే ఉన్నప్పటికీ జిల్లా అధికారుల దృష్టికి ఎందుకు తీసుకురాలేదని అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులను తప్పించేందుకు దాడుల అధికారులతో ఒక స్థానిక పెద్దమనిషి కుమ్మక్కై కేసును తప్పుదోవ పట్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొత్తగూడెం డివిజన్ ఫారెస్ట్ కార్యాలయంలో సుమారు గంట పాటు జరిగిన మంతనాలపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫారెస్ట్ విజిలెన్స్ శాఖ అధికారులు ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు లేదా విజిలెన్స్ శాఖ జోక్యం చేసుకుని పూర్తి వాస్తవాలను బయటపెట్టాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

### ››› విజిలెన్స్ జోక్యం తప్పదా?

చాతకొండ అటవీ పరిధిలో వెలుగులోకి వచ్చిన వన్యప్రాణాల వేట కేసు కొత్త మలుపు తిరుగుతోంది. ఈ కేసులో ఫారెస్ట్ అధికారుల చర్యలపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో విజిలెన్స్ శాఖ దృష్టి సారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అసలు నిందితులను తప్పించేందుకు అమాయకులను ఇరికించారన్న ఆరోపణలతో పాటు లక్షల్లో సెటిల్మెంట్ జరిగిందన్న ప్రచారం నేపథ్యంలో పూర్తి స్థాయి విచారణ అవసరమని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ శాఖ జోక్యం తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## మహనీయుడి జయంతి వేడుకలు ఇలా జరిగితే ఎలా..?

(మొదటి పేజీ తరువాయి...)

లోపంగా మారింది. దీంతో హాజరు కావాల్సిన ప్రజలు పూర్తి సమాచారం లేకపోవడంతో వేడుకలకు దూరమయ్యారని తెలుస్తోంది. దళిత కుటుంబాలు, ముఖ్య అతిథులకు ముందొస్తుగా ఇవ్వాల్సిన ఆహ్వాన పత్రాలను కార్యక్రమం జరుగుతున్న సమయంలోనే అందించడం నిర్వాహకుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా నిలిచింది. సభ వేదిక, కార్యక్రమ సమయం, ప్రసంగకర్తల వివరాలు వంటి కీలక అంశాలను ముందుగానే తెలియజేయకపోవడం వల్ల మొత్తం కార్యక్రమం గందరగోళంగా మారింది. మహనీయుడి జయంతి వేడుక కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన ముఖ్య నేతలు స్టేజ్‌పై కూర్చోవడానికే పరిమితమయ్యారని స్వర్గీయ బాబు జగ్జీవన్ రామ్ చరిత్రను సమగ్రంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. దళిత సమాజ ఐక్యతను బలపరిచే విధంగా కార్యక్రమం నిర్వహించాల్సిన సమయంలో సమగ్ర ప్రణాళిక లేకపోవడం, నేతల మధ్య సమన్వయం లోపించడం కారణంగా వేడుకలు అస్తవ్యస్తంగా మారినట్లు హాజరైన వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో కమిటీ నిర్వహణలో ఉన్న లోపాలు బహిర్గతమయ్యాయని పేర్కొంటున్నారు.

ముందస్తు ప్రణాళిక సరిగా లేకపోవడం తో పాటు కమిటీ నిర్వాహకుల బాధ్యతల స్పష్టత లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఎలా నిర్వహిస్తారోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంపై దళిత వర్గాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సభను ఉద్దేశించి మాట్లాడే సామర్థ్యం లేని కొంతమంది దళిత నాయకులు రాజకీయ నాయకుల గొప్పలు చెప్పుకునేందుకు మాత్రమే పరిమితమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దళిత సంఘాల ఐక్యతతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



### సభకు సరైన గౌరవం తీసుకొచ్చిన జిల్లా ఎస్పీ ప్రసంగం




సభలో ముఖ్య అతిధిగా పాల్గొన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తన ప్రసంగంతో మహనీయుడి జయంతి వేడుక కార్యక్రమానికి సరైన గౌరవాన్ని తీసుకొచ్చారు. స్వాతంత్ర సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవిత పోరాటం, దేశానికి చేసిన సేవలను వివరించి యువతకు స్ఫూర్తినిచ్చారు. మహనీయుడి ఆలోచనలు, జీవన విధానం ప్రతి ఒక్కరూ తెలుసుకుని ఆచరించాలని సూచించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం

### బాబు జగ్జీవన్ రామ్ గొప్ప ప్రజా సేవకుడు :కాకెల్లి సైమన్



స్వాతంత్ర సమరయోధుడు భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గొప్ప ప్రజా సేవకుడని ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కాకెల్లి సైమన్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. మహనీయుడి జయంతి వేడుకల కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడాల్సిన నేతలు తమ వ్యక్తిగత అంశాలకే పరిమితమవుతున్న సమయంలో మహనీయుడి పోరాట స్ఫూర్తిని గుర్తు చేస్తూ కాకెల్లి సైమన్ ప్రసంగం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సమాజంలో కుల వివక్ష ఇంకా కొనసాగుతోందని పేర్కొంటూ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరాన్ని వివరించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో ఐక్యత అవసరమని సూచించారు. ఆయన ప్రసంగం సభలో చైతన్యం నెలకొల్పింది. దీనితో ఆయనను ముఖ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

# పాల్వంచలో ఘనంగా జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలు

- అణగారిన వర్గాల మార్గదర్శకుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్
- జగ్జీవన్ రావు జయంతి వేడుకల్లో పాల్గొన్న మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, డిసిసిబి మాజీ డైరెక్టర్ కొత్వాల





**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 5 , ప్రజా జ్యోతి:** అణగారిన వర్గాల ప్రజలు. ఆర్థిక రాజకీయ సామాజిక రంగాలలో ముందుండాలని మాజీ ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ మార్గదర్శకుడుగా నిలిచిన మహనీయుడని కొత్తగూడెం మేయర్ మూడు గణేష్ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, మాజీ డిసిసిబి డైరెక్టర్ కొత్వాల శ్రీనివాస రావులు కొనియాడారు.. పాల్వంచలోని బి సి ఎం జాతీయ రహదారి లో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు , ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, డిప్యూటీ మేయర్ లలిత కుమారి , డిసిసిబి మాజీ డైరెక్టర్ కొత్తవల శ్రీనివాసరావు లు మాట్లాడుతూ భారత దేశ ఉప ప్రధానిగా. రక్షణ శాఖ మంత్రిత్వంలో దేశ ప్రజల కోసం తను చేసిన త్యాగం మరువలేనిదని అన్నారు. దళితుల అభ్యున్నత కోసం అప్పటి ప్రభుత్వంలో చేసిన సంస్కరణలలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ పాత్ర మరువరానిదనీ అన్నారు. ఈనాటి సమాజంలో ఆర్థిక. రాజకీయ. ఉద్యోగ రంగాలలో కొంతమేరకైనా దళితులు ముందున్నారంటే మహనీయుల త్యాగాలేనని అన్నారు. సిపిఐ పార్టీజిల్లా కార్యదర్శి సాబీర్ భాష మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు ఉన్నత స్థాయికి ఎదగాలని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ తన వంతు కృషి చేశారన్నారు. స్వతంత్ర ఉద్యమంలో దేశ ప్రజల తరపున పోరాడిన వ్యక్తిగా నిలిచాడని చెప్పారు. అంబేద్కర్ భవనానికి అవసరమైన నిధులను ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు ద్వారా నిధులు మంజూరి చేపి స్తామని అన్నారు. డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి మాట్లాడుతూ.. డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ ఆశయాలను ముందు తీసుకొని వెళ్లాలని గుర్తు చేశారు , డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సేవా సమితి అధ్యక్షులు దండోరా శ్రీను, గౌర వ అధ్యక్షులు కార్పొరేటర్ కాల్వ భాస్కర్, కొత్తపల్లి సోమయ్య,గుర్రం వెంకట రత్నం, గజ్జి శ్రీను,కత్తి శ్రీను,రమేష్ రాథోడ్. ఆధ్వర్యంలో ముందుగా జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్పొరేటర్ కొత్వలా కేక్ కట్ చేసి అందరికీ ధన్యవాదములు తెలిపారు, రమేష్ రాథోడ్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల సాధనలో ఆయన చేసిన కృషి అపారమని, సమానత్వం కోసం ఆయన చూపిన దృక్పథం నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. ఆయన ఆలోచనలు, విలువలు ప్రతి ఒక్కరి జీవితంలో ప్రతిఫలించాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన కార్పొరేటర్లు సుగుణ,,గుర్రం విజయ్ కుమార్, సింధు తపస్వి, చెరుకు భాగ్యలక్ష్మి, ఆడుసుమల్లి సాయిబాబు, విశ్వంలను కమిటీ సభ్యులు ను ఘనంగా సన్మానించారు..ఈ కార్యక్రమం లో పలు పార్టీలకు చెందిన నాయకులు. ట్రేడ్ యూనియన్. ఉద్యోగ సంఘాల నాయకులు టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కిలారు నాగేశ్వరరావు.ముత్యాల విశ్వనాథము, పూర్ణ, నరాటి ప్రసాద్, ఇనుప నూరి కుమార్, యస్కె బాషా, కొండం వెంకన్న,చేకూరు అశోక్ , బోగిని సందీప్, నిమ్మల రాంబాబు, చింత నాగరాజు,శ్రీను, దేవీలాల్ గుగులోత్,ఉప్పుశెట్టి రాహుల్,సమ్మయ్య, దాసరి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రాయ్ జయంతి వేడుకలు



**ఇల్లందు, ఏప్రిల్ 5, ప్రజాజ్యోతి:** సంఘ సంస్కర్త, స్వాతంత్ర సమరయోధుడు బాబు జగ్జీవన్ రాయ్ 119వ జయంతి వేడుకలను ఆదివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాబు జగ్జీవన్ రాయ్ చిత్రపటానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూక్య రవికుమార్ నాయక్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రాయ్ పరిపాలన దక్షతతో అఖండ భారతవనికి విశేష సేవలు అందించారని కొనియాడారు. బాబు జగ్జీవన్ రాయ్ దేశ ఉప ప్రధానిగా అభివృద్ధి పథంలో నడిపించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి ఖాసీమ్, కోశాధికారి బన్సీలాల్, న్యాయవాదులు దంతాల ఆనంద్, వెంకటేశ్వర్లు, మహేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చలి వేంద్రం ప్రారంభం






**ఇల్లందు, ఏప్రిల్ 5, ప్రజాజ్యోతి:** రాజస్థాన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నెహ్రు చౌక్ లో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని రాజస్థాన్ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు విశ్వనాథ్ లాహోటి, బాలాజీ రాంమందిర్ అధ్యక్షుడు సునీల్ తోత్ల లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజస్థాన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్ లో ప్రతి ఏడాది వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చల్లని మినరల్ వాటర్ ను చలివేంద్రం ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. సుదూర ప్రాంతాల నుండి ఇల్లందుకు వచ్చే ప్రజలకు మంచినీటి కోసం ఇబ్బందులు పడవద్దని రాజస్థాన్ సేవా ట్రస్ట్ ద్వారా మంచినీటిని అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు రాజస్థాన్ సేవా ట్రస్ట్ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ సేవా ట్రస్ట్ సభ్యులు మనోహర్ తివారి, రాజు జవద్, ముకేశ్, శర్మ, కైలాష్ కొలారియా, కైలాష్ లాహోటి, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో నేడు ప్రజావాణి




**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 5, ప్రజా జ్యోతి:** భద్రాచలం మండల ప్రజల సమస్యల పరిష్కారం కోసం నేడు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించను న్నట్లు తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు తహసీల్దార్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి అన్ని శాఖల మండల అధికారులు హాజరుకానుండగా, ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు సమర్పించవచ్చని తెలిపారు. స్వీకరించిన వినతులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రజావాణికి హాజరై తమ సమస్యలను తెలియజేయాలని తహసీల్దార్ కోరారు.

## కౌన్సిలర్ కు ఘన సన్మానం



**ఇల్లందు, ఏప్రిల్ 5, ప్రజాజ్యోతి:** మున్సిపల్ ఎన్నికల్లో 10వ వార్డు కౌన్సిలర్ గా విజయం సాధించిన మెరుగు కార్తీక్ యాదవ్ ను ఆదివారం ఖమ్మం పట్టణంలో యాదవ మహాసభ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రావ్ గొప్ప సంఘసంస్కర్త



**ఇల్లందు టౌన్, ఏప్రిల్ 5, ప్రజాజ్యోతి:** బాబు జగ్జీవన్ రాయ్ గొప్ప సంఘసంస్కర్త అని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహానీయుడని టీఎం హెచ్ డి రాష్ట్ర అధ్యక్షులు కొరిపల్లి శ్రీనివాస్, 22వ వార్డు కౌన్సిలర్ కోర్లపాటి శివ కిరణ్ లు అన్నారు. ఆదివారం పట్టణంలోని 22వ వార్డులో బాబు జగ్జీవన్ రాయ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడిగా, పరిపాలన దక్షతతో దేశ ఉప ప్రధానిగా అఖండ భారతవానికి విశేష సేవలందించారన్నారు. దేశ ఉప ప్రధానిగా భారతదేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించారని కొనియాడారు. ఆయన 40 సంవత్సరాల పైగా వివిధ శాఖలలో మంత్రిగా పనిచేశారని, ఆయన భారతదేశ చరిత్రలో ఎక్కువ కాలం కేంద్ర క్యాబినెట్ మంత్రిగా పనిచేశాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంహెచ్ డి ఇల్లందు నియోజకవర్గ ఇన్చార్జి మంద కుమార్, ఇల్లందు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భూక్యా రవి కుమార్ నాయక్, టీఎం హెచ్ డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మునగలేటి వీరస్వామి, నాయకులు రాయల శ్రీనివాస్, తాండ్ర నాగరాజు, బసిపాక రవి, సిర్ర ఉపేందర్, రామకృష్ణ, కాంతారావు, మాచర్ల విజయ్ కుమార్, కాశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అతివేగంగా కారు ఆటో ఢీ

- నుజ్జునజ్జైన ఆటో
- పలువురికి గాయాలు ఆసుపత్రికి తరలింపు





**ఇల్లందు, ఏప్రిల్ 5, ప్రజాజ్యోతి:** అతివేగంగా వస్తున్న కారు ఆటో ఎదురెదురుగా అతి వేగంగా ఢీకొనడంతో ఆటో నుజ్జునుజైన ఘటన ఆదివారం ఇల్లెందు మండలం ముకుందాపురం ప్రధాన రహదారిపై జరిగింది. ఇల్లందు నుంచి మహబూబాబాద్ వైపుగా వెళ్తున్న కారు బయ్యారం నుంచి ఇల్లెందు వైపు వస్తున్న ఆటో మితిమీరిన వేగంతో వస్తున్న క్రమంలో ఆటో కారు ఎదురుగా ఢీకొట్టుకోవడంతో ఆటో నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం అందిస్తున్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రమాద ఘటన సమయంలో ఉన్న ప్రజలు పేర్కొంటున్నారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్**




**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 5,ప్రజా జ్యోతి:**నేడు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కావున సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## టేకులపల్లి లో ఘనంగా ఈస్టర్ వేడుకలు





**టేకులపల్లి,ఏప్రిల్05,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం సులానగర్ గ్రామంలో ఆర్సిఎం చర్చిలో ఫాదర్ మార్నేని అర్లయ్య,టేకులపల్లి బీకాలనీ తండాలో ని పెంతే కోస్తూ ప్రార్ధన మందిరం ఫెలోషిప్ కమిటీ ప్రెసిడెంట్ జి.రాంచందర్,సోనియామ్మ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ఈస్టర్ వేడుకలు నిర్వహించారు.దేవాలయంలో ఫాదర్ మార్నేని అర్లయ్య ప్రత్యేక ప్రార్ధనలు చేస్తూ వాక్యాన్ని బోధిస్తూ నేడు ఏసు క్రీస్తు సమాధి నుంచి సజీవుడై పునరుత్థానం చెందిన దినం అని, హింస ద్వేషాలు మరణాన్ని ఇస్తాయి, ప్రేమా,క్షమాపణలు జీవితానికి నూతనత్వాన్ని ఇస్తాయి ఇది నిరూపించడానికె సమాధి నుంచి సజీవుడై తిరిగి వచ్చాడు క్రీస్తు అన్నారు. అనంతరం ఆలయంలో కేక్ కట్ చేసి కొవ్వొత్తులు వెలిగిస్తూ భక్తులు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఈస్టర్ ఫుడ్ స్వీకరించారు. మాలపల్లి గ్రామంలో ఆర్ సి ఎం చర్చిలో పేదలకు, వితంతువులకు, చీరలు పంపిణీ చేసిన ఫాదర్ మార్నేని అర్లయ్య.ఈ వేడుకల్లో ఆర్సిఎం చర్చి యూత్,చింతమల్ల వీరస్వామి,అంతోటి రాకేష్, చింతమల్ల రాజు, ఉండేటి సుమంత్, దామల్ల శశి,మెట్టు రాజేష్, బల్లెం థామస్,తరుణ్ గండమల్ల విజయరాజు,రవి, తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డల రక్షణ – పర్యావరణ పరిరక్షణతోనే దేశాభివృద్ధి

- **ఎంఈఓ రమ**




**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 5, ప్రజా జ్యోతి:** ఆడబిడ్డల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే దేశం నిజమైన అభివృద్ధి సాధిస్తుందని భద్రాచలం ఎంఈఓ టి. రమ పేర్కొన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో "బాలికల విద్యా – ఆరోగ్య పరిరక్షణ" సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ టి. రమ, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వ మార్గదర్శకాలు, సుప్రీం కోర్టు సూచనలను అనుసరించడం అవసరమని తెలిపారు. బాలికల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నెలసరి పరిశుభ్రతపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 5000 మంది విద్యార్థినులకు సంవత్సరానికి అవసరమైన బయోడిగ్రేడబుల్ శానిటరీ న్యాప్కిన్లను ఉచితంగా అందజేయడం అభినందనీయమని అన్నారు. ఆరోగ్యంపై సరైన అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు.ప్రపంచ పర్యావరణ సంస్థ తీసుకున్న ఈ నిర్ణయం ఆడబిడ్డల అభివృద్ధికి, దేశ పురోగతికి దోహదపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు, జాతీయ కార్యదర్శి కళాసాగర్, సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సి.హెచ్. భద్ర, ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి కోనేటి, జాతీయ కార్యదర్శి సాగర్, సహాయ కార్యదర్శి ఉపేందర్ యాదవ్, ఉపాధ్యక్షురాలు శిల్పిక, రాష్ట్ర కార్యదర్శి క్రాంతి నాయుడు, జిల్లా అధ్యక్షుడు శ్యామ్ నాయుడు, పాల్వంచ పట్టణ అధ్యక్షురాలు శ్వేతా నాయుడు, మణుగూరు మండల అధ్యక్షుడు సైదా బాబు నాయుడు, రాష్ట్ర కోఆర్డినేటర్ శివ, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు భారత్, వంశీ, అద్విత్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.పర్యావరణ కార్యకర్తలు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## బార్ ఆధ్వర్యంలో ఘనంగా డా. బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**భద్రాచలం, ఏప్రిల్ 5, ప్రజా జ్యోతి:** భారతదేశ మాజీ ఉప ప్రధానమంత్రి డా. బాబు జగజ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సున్నం రమేష్, మాజీ అధ్యక్షుడు కోట దేవదానం, సీనియర్ న్యాయవాది పేరాల నాగరాజు తదితరులు డా. జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అధ్యక్షుడు కొడాలి శ్రీనివాస్, డా. జగజ్జీవన్ రామ్ దేశంలోని అణగారిన, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను గుర్తుచేశారు. సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.అలాగే డా. బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలను అమలు చేయడంలో ఆయన అందించిన సేవలు అపారమని, నేటి మరియు భవిష్యత్ తరాలకు ఆయన జీవితం ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణి



**లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 5 ( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడెంలోని త్రియేక దేవార్చనాలయంలో ఈస్టర్ పండుగ సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. ఏటిఈసీ (అలియన్స్ ఆఫ్ టీచర్స్ అండ్ ఎంప్లాయిస్ క్లబ్ ) జిల్లా అధ్యక్షుడు మాలోత్ బాలు నాయక్ ఆధ్వర్యంలో చిన్నారి విద్యార్థులకు పరీక్షలకు ఉపయోగపడే విద్యా సామగ్రితో పాటు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చర్చి ఫాస్టర్ యు. అమృత రావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. సమాజంలో మంచి మార్పుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు దోహదపడతాయని విద్యతోనే భవిష్యత్తు బలపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ డేవిడ్ రాజ్ వెంకటరావు, రమేష్, రాంబాబు, లక్ష్మణ్ నాయక్, నవీన్ తదితర చర్చి సభ్యులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అలుపెరగని సమరయోధుడు బాబు జగ్జీవన్‌రామ్

- **ఐటీడీఏ ఎస్ డి సి రవీంద్రనాథ్**



**భద్రాచలం, ఏప్రిల్ 5, ప్రజా జ్యోతి:** దేశ స్వాతంత్ర్యం కోసం, సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం, ఆలు పెరగని సమరం సాగించిన రాజకీయ, సామాజిక విప్లవ యోధుడు, భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ అని ఐటీడీఏ ఎస్ డి సి రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం ఐటిడిఏ సమావేశం మందిరంలో బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా ఐటిడిఏ కార్యాలయంలోని యూనిట్ అధికారులు మరియు సిబ్బందితో కలిసి బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ బీహార్ లోని వెనుకబడిన కులంలో పుట్టిన బాపూజీగా ఆయన ప్రసిద్ధి చెందారు. భారత పార్లమెంట్లో40 ఏళ్ల పాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉప ప్రధానిగా వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమములో ఏవో సున్నం రాంబాబు, మేనేజర్ ఆదినారాయణ, శ్రీనివాస్, లక్ష్మయ్య, మోహన్, పవన్, గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు అభిషేకం, స్వర్ణ పుష్పార్చన





**భద్రాచలం, ఏప్రిల్ 5, ప్రజా జ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం సందర్భంగా అంతరాలయంలో ఆర్జిత సేవల్లో భాగంగా అభిషేకం, స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు. ఈ కల్యాణాల్లో అధిక సంఖ్యలో జంటలు పాల్గొన్నారు.

# ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు




**టేకులపల్లి,ఏప్రిల్ 05,ప్రజాజ్యోతి:** స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప రాజకీయవేత్త బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఆదివారం టేకులపల్లి మండలం రాంపురం గ్రామ పంచాయతి హరిజనవాడలో ఎంఆర్పిఎస్ జిల్లా కన్వీనర్ నల్లగట్ల వేంకన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలో అతి సామాన్య దళిత కుటుంబంలో జన్మించిన బాబు జగ్జీవన్ రామ్ తన చిన్న వయసులోనే స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న వ్యక్తిగా చిన్న వయస్సులోనే చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించి 31 సంవత్సరంలోనే నెహ్రూ మంత్రివర్గంలో కేంద్ర మంత్రి పదవిని చేపట్టిన కేంద్ర ప్రభుత్వంలో నాడు రైల్వే రక్షణ శాఖ వ్యవసాయ శాఖ ఇంకా మరెన్నో కేంద్ర మంత్రి పదవులను అధిరోహించిన గొప్ప దీశాలి గొప్ప దళిత నేతగా దేశ ప్రజల మనలను పొందిన వ్యక్తిగా బాబు జగ్జీవన్ రామ్ దేశానికి ఎనలేని సేవలందించిన గొప్ప దళిత నేతగా భారత ఉప ప్రధానిగా దేశ ప్రజలకు సేవ అందించి,అభివృద్ధి పథంలో నడిపించడంలో కీలక పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పాల్వంచలో విషాదం

- **రోడ్డు ప్రమాదంలో కార్పొరేటర్ కుమారుడు మృతి**



**పాల్వంచ, ఏప్రిల్ 5, ప్రజా జ్యోతి:** పాల్వంచ పట్టణంలో విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని యువకుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఆదివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో 34వ డివిజన్ కార్పొరేటర్ భట్టు విజయలక్ష్మి కుమారుడు అఖిల్ నందన్ (21) మృతి చెందాడు. సమాచారం ప్రకారం, బస్టాండ్ సమీపంలో అఖిల్ నందన్ తన బుల్లెట్ బైక్‌పై ప్రయాణిస్తుండగా, రోడ్డు దాటుతున్న సమయంలో ఎదురుగా వేగంగా వచ్చిన కారు అతడిని ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావం తీవ్రంగా ఉండటంతో అతడు రోడ్డుపై పడిపోయి తీవ్ర గాయాల పాలయ్యాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, గాయపడిన అఖిల్ నందన్‌ను సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించిన తరువాత అతడు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు విషాదంలో మునిగిపోయారు. యువకుడి ఆకస్మిక మరణం ప్రాంతంలో చర్చనీయాంశమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రోడ్డు భద్రతపై నిర్లక్ష్యం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో పాల్వంచ పట్టణంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

# నేషనల్ హైవే పైనే వ్యాపారాలు నిర్వహిస్తామంటూ వ్యాపారుల ఆందోళన

- **-అధికారులు, పోలీసులు హెచ్చరించినా ఆదేశాలు బేఖాతర్**



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 5 (ప్రజా జ్యోతి ):** జాతీయ రహదారి పక్కనే దుకాణాలు నిర్వహించుకుంటామంటూ సంత వ్యాపారులు ఆదివారం మండల పరిధిలోని సారపాక ఐటీసీ సమీపంలో సంత ప్రదేశం వద్ద జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. కాగా జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు పెద్దసంఖ్యలో నిలిచిపోవడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సమాచారం అందుకున్న సంబంధిత పంచాయతీ అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకుని సంత వ్యాపారులను జాతీయ రహదారిపై వ్యాపారాలు చేయవద్దంటూ హెచ్చరించినా వ్యాపారులు వినకుండా ఆందోళనను ఉధృతం చేశారు. సంత వ్యాపారులు రోడ్డుపైకి వచ్చేలా వ్యాపారం చేయడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఇది మంచి పద్ధతి కాదని అధికారులు వ్యాపారులను హెచ్చరించినా వినలేదు. దీంతో ప్రయాణీకులు వ్యాపారుల మొండి వైఖరిని తప్పుపడుతున్నారు. ఎట్టకేలకు పోలీసులు అక్కడకు చేరుకుని వ్యాపారులకు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా ఆగి ఉన్న వాహనాలను పంపించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.





# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



**అశ్వారావుపేట, ఏప్రిల్ 05, ప్రజాజ్యోతి :** లారీని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై యయాతి రాజు తెలిపిన వివరాలు ప్రకారం ఆదివారం మండలంలోని గాండ్ల గూడెం శివారు వద్ద ఏపీలోని జీనుగుమిల్లి మండలం తాటి రామన్నగూడెం, గ్రామానికి చెందిన మడకం సంతోష్ (19), పండు సందీప్ (20) అశ్వారావుపేట మండలంలోని చిచ్చోడిగుంపు గ్రామంలో బంధువుల ఇంటికి శుభాకార్యానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్న క్రమంలో గాండ్లగూడెం గ్రామ శివారులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంటంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ తెలిపారు.

# ఐటీసీ పెద్దలారా... కార్మికులకు న్యాయం చేయండి...

- **-11వ రోజుకు చేరిన కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ రిలే దీక్షలు**




**బూర్గంపహాడ్, ఏప్రిల్ 5 (ప్రజా జ్యోతి ):** ఐటీసీ అధికారులారా ...సమస్యలతో సతమతమవుతున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో-కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, బల్లెం నాగయ్య, ఎండీ యాకూబ్ భాషా డిమాండ్ చేశారు. ఆదివారం రిలే నిరాహారదీక్షలు 11వ రోజుకు చేరుకోవడంతో దీక్షల్లో బత్తుల కిరణ్ బాబు, జజ్జరి రాజేశ్వరి, జట్యాల లీలావతి, గాదె సత్యానందం, కళావతి, తార, ఎరుసు సత్తిరెడ్డిలు పాల్గొని తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ బాధ్యులు మాట్లాడుతూ 13వ వేతన ఒప్పంద కాలం సమస్యలు పెండింగ్ లోనే ఉన్నాయని, ఒప్పదం కాలం పూర్తయి వారం దాటుతున్నా నేటికీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని దీనికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమన్నారు. 14వ వేతన ఒప్పందాన్ని జేఏసీతోనే కలిసి చేయాలని డిమాండ్ చేశారు. ఐటీసీ యాజమాన్యం దిగొచ్చేంతవరకు పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ దీక్షా శిబిరంలో జేఏసీ సభ్యులు సింగారపు సతీష్, బత్తుల గోపాలరావు, తెలంగాణ రాజ్యాధికార పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి ప్రశాంత్నాయుడు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గుండాలు....నీతి మాలిన చర్యలు

- **- మాజీ ఎంపీటీసీ, బిఆర్ఎస్ పార్టీ ఎస్టి సెల్ అధ్యక్షులు కాయం శేఖర్**



**పినపాక,ఏప్రిల్ 05(ప్రజాజ్యోతి):** బి ఆర్ ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారి గజ్వేల్ క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ గుండాలు దాడి చేసి ఆద్దాలు, ఫర్నిచర్ను ధ్వంసం చేయడంతో పాటు గోడలపై బలవంతంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోను ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని, కాంగ్రెస్ గుండాలు నీతిమాలిన చర్యలకు పాల్పడుతున్నారని, బి ఆర్ ఎస్ పార్టీ పినపాక మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు, మాజీ ఎంపిటిసి కాయం శేఖర్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పై కాంగ్రెస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండిస్తూ ముమ్మాటికి ఇది సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడని, పట్టపగలు అధికారమదంతో విర్రవీగుతూ సోయి మరిచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు బీహార్ గ్యాంగ్‌ను తలపిస్తుందన్నారు. ఏకంగా ప్రజాప్రతినిధుల క్యాంపు కార్యాలయాల పైనే ముప్పేట దాడులు చేస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా లేనట్లా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధులపై, ప్రజా సంఘాలపై, మీడియాపై దాడులు నిత్యకృత్యం కావడం సిగ్గుచేటన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీస్ యంత్రాంగం కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ సైన్యంలా మారిపోయారని, వాళ్లు చేసే దాడులను ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. ఒకవైపు హేట్ స్పీచ్ బిల్ పేరుతో ప్రజల ప్రతిపక్షాలు, నోరు మూయిస్తూ మరోవైపు కాంగ్రెస్ గుండాలతో దాడులు చేయించడం ప్రజాపాలన ఎలా అవుతుందన్నారు. ఇందిరమ్మ రాజ్యం అని చెబుతూ గూండారాజ్యం అమలు చేస్తున్నారన్నారు. సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో పొలిటికల్ టూర్లు చేస్తూ పాలనను గాలికి వదిలేశారని అన్నారు. మీ అణిచివేతలకు, నిర్బంధాలకు, దాడులకు బీఆర్ఎస్ పార్టీ అదరదు, బెదరదు అన్నారు ప్రజాక్షేత్రంలో మిమ్మల్ని అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని, ప్రజల తరపున పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడులు జరిపిన కాంగ్రెస్ గుండాలను గుర్తించి వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.